ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	586.80 (304.4680)	5,41,643	5,40,503
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.53 (3.58)	7,549	17,600
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.47 (41.93)	5,48,059	5,43,617

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220


సూర్యాపేట జిల్లా మోతె మండలంలో సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం ప్రకటనతో ఊరట

- నష్ట పరిహారాన్ని ప్రకటించిన ముఖ్యమంత్రి
- సూర్యాపేట జిల్లాలో సీఎం సమీక్ష
- కలెక్టర్‌కు రూ.5కోట్ల నిధులు అందుబాటులోకి

వర్షాలతో నష్టపోయిన కుటుంబాలు కుదుటపడేలా పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడం బాధితులకు కొంత ఊరట కలిగించింది. వర్షాల కారణంగా మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం నామవరంలో జరిగిన అధికారుల సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా పరిహారంపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల ఆర్థిక సహాయం ఇస్తామని సీఎం ప్రకటించారు.పశువులు చనిపోతే ఒక్కో జీవానికి రూ.50వేల చొప్పున, గొర్రెలు, మేకలు చనిపోతే ఒక్కోదానికి రూ.5వేల చొప్పున యజమానులకు ఇస్తామన్నారు. అంతేగాక ఇల్లు కూలిపోయినవారికి పీఎం ఆవాస్‌యోజన పథకం కింద పరిహారం ఇవ్వడంతో పాటు, అర్హులైనవారికి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇల్లు నిర్మించిఇస్తామని సీఎం ప్రకటించడంపై బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు తక్షణం మరమ్మతులు చేయడంతో పాటు, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను సీఎం ఆదేశించారు. వరద బాధితులను ఆదుకునేందుకు సూర్యాపేట జిల్లాకు రూ.5కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో తక్షణ అవసరాలతో పాటు, పునరావాస కేంద్రాల నిర్వహణ,అత్యవసర పనులకు కలెక్టర్ విచక్షణతో నిధులు మంజూరుచేసి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అదే విధంగా వర్ష ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి సోమవారం పర్యటించి బాధితులను ఓదార్చారు.నష్టపోయిన ప్రతీ ఒక్కరికి అండగా ఉంటామని, అందరినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

సూర్యాపేట జిల్లాలో భారీ నష్టం

సూర్యాపేట జిల్లాలో వరదల కారణంగా ఇద్దరు మృతి చెందినట్టు అధికారులు నిర్ధారించారు. వరదలకు సుమారు 14,120 ఎకరాల్లో సాధారణ పంటలు, 5,576 ఎకరాల్లో బత్తాయి తోటలకు నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమికంగా అంచనావేశారు. అదేవిధంగా 15 చెరువులు, ఆరు కాల్వల కట్టలు తెగాయి. నడిగూడెం మండలం కాగితరాం చంద్రాపురంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వకు గండి పడడంతో గ్రామంలోకి వరద చేరడంతో గ్రామం నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు 14.380కిలోమీటర్ వద్ద, యాతవాకిళ్ల ఎడమ ప్రధానకాల్వకు 4.500కిలోమీటర్ వద్ద, వేములూరు ప్రాజెక్టు ఎడమకాల్వకు 5, 8, 9, 10 కిలోమీటర్ల వద్ద గండ్లుపడ్డాయి.రెడ్డకుంట మేజర్‌కు 2.150 కిలోమీటర్ వద్ద, మూసీ ఎడమకాల్వకు 11.950 కిలోమీటర్ల వద్ద గండిపడింది. జిల్లాలో ఎనిమిది గ్రామాల నుంచి మొత్తం 2,750 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రత్యేక శిబిరంలో వారికి వసతి సదుపాయాలు కల్పించారు. ఐదు పునరావాస కేంద్రాలు కొనసాగిస్తున్నామని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ వెల్లడించారు. ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలో పదికిపైగా పశువులు మృతి చెందగా, 11 రోడ్లు మరమ్మతులకు గురయ్యాయి. ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతుకు సుమారు రూ.23కోట్ల నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనావేశారు. పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో తాత్కాలిక మరమ్మతులకు రూ.65లక్షలు, శాశ్వత మరమ్మతులకు రూ.5.65కోట్లు అవసరమని అంచనా, 11కేవీ విద్యుత్ స్తంభాలు 750, ఎల్‌టీ స్తంభాలు 450 నేలకూలాయని సంబంధిత శాఖ అధికారులు నివేదించారు. 55 ట్రాన్స్‌ఫార్మర్లు, వీటి సరఫరా నిమిత్తం కండక్టర్ల నష్టం వాటిల్లిందని టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు అంచనావేశారు. జిల్లాలో 51వరకు ఇళ్లు కూలినట్టు ప్రాథమిక అంచనా. అదేవిధంగా మేళ్లచెరువు-కోదాడ మార్గమధ్యంలో ఉన్న కందిబండ వద్ద బ్రిడ్జి కూలిందని, ఇంకా నష్టం అంచనా పూర్తిస్థాయిలో రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. నాగార్జునసాగర్ ఎడమకాల్వకు, మేజర్లకు, మైనర్లకు గండ్లు పడడం, తూములు తెగిపోవడం వంటి ఘటనలు నమోదయ్యాయని, వీటన్నింటికీ యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు.

రోజంతా చెదురుమదురు జల్లులు

ఉమ్మడి జిల్లాలో సోమవారం వర్షం తగ్గుముఖం పట్టినా, చెదురుమదురు జల్లులు పడ్డాయి. నల్లగొండ జిల్లాలో సగటున 6.6మి.మీ వర్షపాతం నమోదైంది. నార్కట్‌పల్లిలో అత్యధికంగా 29.9మి.మీ వర్షపాతం, అత్యల్పంగా అనుములలో 0.1మి.మీ వర్షపాతం నమోదైంది.

అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించాలి

సీఎం రేవంత్‌రెడ్డి

మోతె, సెప్టెంబరు 2: వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వరద పరిస్థితులపై సోమవారం సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని రాఘవాపురం క్రాస్‌రోడ్ వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం 20వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా ఉందని, వరదల్లో ఇద్దరు మృతిచెందారని, 450 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. నడిగూడెం మండలం కాగితరామచంద్రపురం వద్ద ఎన్నెస్పీ ఎడమ కాల్వకు గండిపడడంతో సుమారు 300 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారన్నారు. 14 చెరువులు, 750 కరెంట్ స్తంభాలు, 150 ట్రాన్స్‌ఫార్మర్‌లు, 11 తారురోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయన్నారు. జిల్లాలో 30సెంటీమీటర్ల నుంచి 45సెం.మీ మేరకు వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయన్నారు. వరదలతో నష్టపోయిన ప్రతీ ఒక్కరికి పరిహారం అందజేస్తామన్నారు. వరదతో గ్రామాల్లో నెలకొన్న విపత్కర పరిస్థితులను చక్కబెట్టేందుకు అధికారులతో ప్రజాప్రతినిధులు పర్యటించాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం సాయం చేయాలి

రాష్ట్రంలో పరిస్థితులు చక్కబడేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.2వేల కోట్లను విడుదల చేయాలని, అందుకు రాష్ట్రానికి చెందిన చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దృష్టిసారించాలన్నారు. రాష్ట్ర పరిస్థితులను పరిశీలించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాతోపాటు, పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని పర్యటించాలని కోరానన్నారు. బీఆర్ఎస్ నేత కవిత బెయిల్‌పై వస్తుండడంతో 20 మంది ఎమ్మెల్యేలతో ఢిల్లీ వెళ్లిన ఓ నాయకుడు ట్విట్టర్‌లో కామెంట్లు పెడుతున్నారని, మరో నేత ఫాం హౌస్‌లో పడుకున్నారని, మిగతా నేతలు ఎక్కడున్నారో కూడా తెలియదన్నారు. వీరంతా ప్రస్తుత పరిస్థితుల్లో బురద రాజకీయాలు మానుకుని ప్రజల వద్దకు రావాలన్నారు. పంట నష్టం వివరాలను అధికారులు వెంటనే సేకరించాలన్నారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ముందుకు వచ్చి ముఖ్యమంత్రి సహాయ నిధికి నిధులు అందజేయాలన్నారు. రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు ఎనిమిది బృందాలుగా అధికారులకు శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం నష్టపోయిన పంటలు, కొట్టుకుపోయిన ఇళ్లు, దెబ్బతిన్న రహదారులు, గండ్లు పడిన కాల్వల ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం తిలకించారు.కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, కోదాడ, తుంగతుర్తి ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, మందుల సామేలు, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, ఇరిగేషన్ ఎస్ఈ రమేష్‌బాబు, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఆర్డీవో వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేటలో దెబ్బతిన్న పంటల ఫొటోలను పరిశీలిస్తున్న సీఎం



ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు, చెరువులకు జలకళ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు, ఎగువనుంచి వస్తున్న వరదకు ప్రాజెక్టులు, చెరువులు, వాగు లు జలకళను సంతరించుకున్నాయి. నాగార్జునసాగర్, మూసీ ప్రాజెక్టులతో పాటు డిండి, శాలిగౌరారం, పానగల్లు రిజర్వాయర్లు తదితర ప్రాజెక్టులు నీటితో నిండుకుండలా మారాయి. కృష్ణానదికి వరద భారీగా వస్తుండడంతో నాగార్జునసాగర్ 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ దిగువన టెయిల్‌పాండ్, పులిచింతల ప్రాజెక్టు నుంచి కూడా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. వాగులన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. దాదాపు అన్ని చెరువులు నీటితో నిండడంతో భూగర్భజలాలు పెరిగాయని, దీంతో ఈ ఏడాది రెండు పంటలకు, పండ్ల తోటలకు ఢోకాలేదని, లేదని రైతులు పేర్కొంటున్నారు.


మఠంపల్లి మండలంలో దెబ్బతిన్న పత్తి

నల్లగొండ జిల్లాలో 498 ఎకరాల్లో పంటనష్టం

నల్లగొండ జిల్లాలో భారీ వర్షాలకు 498 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని అధికారులు అంచనావేశారు. దామరచర్ల, మాడ్గులపల్లి, వేములపల్లి, గుర్రంపోడు, పెద్దవూర మండలాల్లో నష్టం వాటిల్లింది. మొత్తం 475 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో పత్తి, మరో మూడు ఎకరాల్లో మిరప పంట నష్టం వాటిల్లింది. జిల్లాలో పంచాయతీరాజ్ రోడ్లు ఆరు చోట్ల దెబ్బతినగా, వాటి మరమ్మతులకు రూ.1.06కోట్ల నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనాలు రూపొందించారు. నల్లగొండ మండలంలో నల్లగొండ-నకిరేకల్ రహదారి, తిప్పర్తి మండలంలో చెన్నయ్యగూడెం-కాశవారిగూడెం రహదారి, మిర్యాలగూడ మండలంలో ఇందిరమ్మ కాలనీ నుంచి బోజ్యనాయక్‌తండా రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. మాడ్గులపల్లి మండలంలో కల్వలపాలెం- సల్కునూరు రోడ్డు, కల్వలపాలెం-నక్కలగుట్ట రోడ్డు మరమ్మతులకు గురైంది. ఆర్‌అండ్‌బీ రహదారులకు నష్టంపై పూర్తిస్థాయిలో అంచనా రూపొందలేదు. విద్యుత్ సరఫరా వ్యవస్థకు ఎలాంటి నష్టం చోటుచేసుకోలేదు.

డిండి వాగులో చిక్కుకున్న చెంచులు ● 7లో..

కోదాడలో జాతీయ రహదారి వెంట ప్రవహిస్తున్న వరద



మఠంపల్లిలో వరద తాకిడికి దెబ్బతిన్న రైల్వేట్రాక్

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే
ఎడమకాల్వకు శాపం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్నజూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, సెప్టెంబరు 2: ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే ఎడమకాల్వకు శాపంగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన పార్టీ ప్లీనరీ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది సాగర్ ప్రాజెక్టులో నీరు లేక ఎడమకాల్వకు నీరు విడుదల చేయలేదన్నారు. ఈ సమయంలో కాల్వల్లో పెరిగిన కంపచెట్లను, ఇసుక మేటలను అధికారులు తొలగించకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఎడమకాల్వ వెంట పర్యటించి మట్టికట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేయాలని, మేజర్ల తూముల షట్టర్లకు మరమ్మతులు చేయాలని అధికారులకు, సంబంధిత మంత్రిత్వశాఖకు నివేదిక ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. అందుకే నడిగూడెం వద్ద కాల్వకు గండిపడటం లాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. గండి పూడ్చే నాటికి ఆయకట్టులో వరి నాట్లకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఆయకట్టు రైతులకు ఎప్పటి వరకు నీటిని విడుదల చేస్తారో కనీసం షెడ్యూల్‌ను ప్రకటించలేదని అన్నారు. ప్రభుత్వం జిల్లాల వారీగా వ్యవసాయ ప్రణాళికను సైతం రూపొందించకపోవడం దురదృష్టకరమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య మాట్లాడుతూ, రుణమాఫీపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ప్రభుత్వం నిధులు విడుదల చేసి షరతులు లేకుండా రూ.2లక్షలు మాఫీ చేయాలన్నారు. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా వరదలు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు లోతట్టు ప్రాంత, ముంపు బాదితులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇప్పటికే విషజ్వరాలు ప్రబలుతున్నాయని, వర్షాలతో మరింతగా విజృంభించకుండా వైద్యశిబిరాలు నిర్వహించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, నాయకులు నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, వెంకటేశ్వర్లు, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

అదనపు కలెక్టర్


చండూరు పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

చండూరు, సెప్టెంబరు 2: అధికారులు, సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర హెచ్చరించారు. సోమవారం చండూరు మునిసిపాలిటీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. మునిసిపల్ కార్యాలయంలో సిబ్బంది, అధికారుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఐదుగురు పారిశుధ్య కార్మికులు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో వారిని విధుల్లో నుంచి తొలగిస్తున్నామన్నారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలో సీజనల్ వ్యాధులు, జ్వర సంబంధ కేసులపై ఆరా తీశారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు పెరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ మున్వర్‌అలీ, వైద్యాధికారులు డాక్టర్ మాసరాజు, డాక్టర్ సంధ్యాబ్లెస్సి, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దు: డీఈవో


హాలియా, సెప్టెంబరు 2: విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో భిక్షపతి అన్నారు. సోమవారం హాలియాలోని కేజీబీవీని ఆయన తనిఖీచేశారు. తరగతి,వంట గదులు, కూరగాయలు, నిత్యావసర సరుకులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆహారం, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని,వర్షాకాలంలో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట పాఠశాల స్పెషల్ ఆఫీసర్ హైమావతి, మంజుల, అనూష, కరుణ ఉన్నారు.


సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రాంచంద్రాపురం వద్ద ఎడమకాల్వకు 60 అడుగుల మేర పడిన గండి

ఆయకట్టుకు.. గండాలే

- ఎడమకాల్వకు తరుచూ గండ్లు
- కాల్వ పరిస్థితిపై రైతుల్లో ఆందోళన

మృగశిరకార్తెతో మొదలయ్యే సాగు పనులు సాగర్ ఆయకట్టులో ఈ సీజన్‌లో వర్షాలు సకాలంలో పడకపోవడంతో ఆలస్యమయ్యాయి. జూన్ మాసం మొత్తం రైతులు వానల కోసం ఎదురుచూశారు. రెండేళ్లుగా ఆయకట్టులో సాగు అంతంతమాత్రంగా సాగగా ఈ సారైనా ముందుకు సాగుతుందా అన్న ఆందోళన రైతాంగం ఉండేది. అయితే ఆ తర్వాత కురిసిన వర్షాలు సాగుపై ఆశలు రేకెత్తించాయి. జూన్ చివర, జూలై, ఆగస్టు మొదటి రెండవు వారాల్లో కురిసిన వర్షాలతో సాగుపై ధీమా వచ్చింది. అయితే ప్రస్తుతం ధీమా కాస్తా భారీవర్షాలతో రైతుల్లో భయాందోళన మొదలైంది. ఆగస్టు చివరి వారం నుంచి కురుస్తున్న వర్షాలకు ఆయకట్టు కాల్వలకు వరుసగా గండ్లు పడుతుండటం వారిని ఆందోళన కలిగిస్తోంది. కాల్వలకు మరమ్మతులు పూర్తయి నీరు సకాలంలో అందకపోతే పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆయకట్టు నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతుందన్న విమర్శలు ఉన్నాయి. 2022లో నల్లగొండ జిల్లా నిడమనూరులో కాల్వకు గండి పడి గంటల వ్యవధిలో చుట్టుపక్కల ప్రాంతాల పొలాలు ధ్వంసమయ్యాయి. సమీప పొలాల్లో మట్టి, రాళ్ల మేటలు వేసి సాగుకు ఇబ్బందిగా మార్చింది. దీనికి తోడు 500 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగింది. తాజాగా నడిగూడెం మండలం రాంచంద్రాపురం వద్ద గండిపడి నీటి వృథాతో పాటు సమీప పొలాలు ధ్వంసమ య్యాయి. ప్రస్తుతం ఎడమకాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు.

మిర్యాలగూడ(వ్యవసాయం)


పొలాల్లోకి వెళ్తున్న నీరు

7


ముక్త్యాల మేజర్‌కు గండిపడి వృథాగా పోతున్న నీరు

పనులు పూర్తయిన నెల రోజుల్లోనే...

హుజూర్‌నగర్: సాగర్ ఎడమకాల్వపై ఉన్న ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. ఈ కెనాల్ కింద 1.25 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. రూ.18కోట్లతో లైనింగ్ పనులు పూర్తి చేసి నెల గడవక ముందే వరద ఉధృతికి ధ్వంసమయ్యాయి. కాల్వకు రెండు చోట్ల గండిపడటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మురుగు కాల్వలను శుభ్రం చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి మురళి


మురుగు కాల్వలను సిబ్బందితో శుభ్రం చేయిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి మురళి

మునుగోడు రూరల్, సెప్టెంబరు 2: గ్రామాల్లో మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మురళి ఆదేశించారు. సోమవారం మండలంలోని సింగారం గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. రెండు వార్డులో అధ్వానంగా ఉన్న మురుగు కాల్వలను పరిశీలించి వెంటనే పరిశుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలో సిబ్బంది కొరత ఉన్నందున మునుగోడు నుంచి ఆరుగురు పారిశుధ్య సిబ్బందిని గ్రామానికి పంపిస్తామన్నారు. చౌరస్తాలో శిథిలావస్థలో ఉన్న పాత ఇంటి గోడలను స్వచ్ఛందంగా తొలగించాలని ఇంటి యజమాని దేశెట్టి వెంకటేశ్వర్లును కోరారు. మురుగు నీరు, వరద గ్రామం బయటికి తరలించేలా చర్యలు తీసుకోవాలని డీపీవోను గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో ఎంపీవో స్వరూపారాణి, పంచాయతీ కార్యదర్శి గీత, తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

డిండి: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా నివారణాధికారి దుర్గయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు వృద్ధిచెంది మలేరియాను వ్యాపింపజేస్తాయన్నారు. అనంతరం పాఠశాలలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ శైలిమా, సీహెచ్‌వో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆమెకు ఇంటిని నిర్మించి ఇవ్వాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


ఇంటి నిర్మాణానికి కొలతలు వేస్తున్న అధికారులు

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబర్ 2: ఎండ వచ్చినా, వాన వచ్చినా తలదాచుకునేందుకు సరైన వసతి లేక చిన్న గుడారంలోనే ఉంటూ ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబానికి ఇంటిని నిర్మించి ఇవ్వాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలతో మండల కేంద్రానికి చెందిన సిగపట్ల వెంకటమ్మ, ఆమె కుమార్తెలు, కుమారుడు ఓ చిన్న గుడారంలో నివసిస్తూ పడుతున్న ఇబ్బందులపై 'ఆమే ఆధారం.. నిలువ నీడలేని జీవితం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 1వ తేదీన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఆమెకు ఇంటిని నిర్మించి ఇవ్వాలని, ఆమె ఇంటి వద్దకు వెళ్లి ఇంటి నిర్మాణం, ఇతర వసతులపై ప్రతిపాదనలు పంపాలని పంచాయతీరాజ్ శాఖ డీఈని ఆదివారం ఆదేశించారు. ఈ మేరకు డీఈ నరసింహారెడ్డి, ఏఈ సైదులుతో కలిసి సోమవారం మండల కేంద్రానికి వచ్చి వెంకటమ్మ ఇంటి ఆవరణ, పరిసరాలను పరిశీలించి ఇంటి నిర్మాణం, వసతులపై ప్రతిపాదనలు రూపొందించి కలెక్టర్‌కు నివేదించారు. వెంటనే పనులు ప్రారంభించి సాధ్యమైనంత త్వరగా ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించినట్టు తెలిసింది. అదేవిధంగా మెప్మా పీడీ, మండల ప్రత్యేక అధికారి కరుణాకర్, ఎంపీడీవో భిక్షంరాజు, ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్ తదితరులు ఆమె ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మానసికస్థితి సరిగాలేని ఇద్దరు కుమార్తెలకు దివ్యాంగ పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రభుత్వపరంగా రావాల్సిన సంక్షేమ పథకాలను అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల పక్షపాతి

చండూరు, సెప్టెంబరు 2: చేనేత కార్మికుల పరిష్కారానికి ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. నేతన్నకు చేయూత పథకం ప్రభుత్వం కింద రూ.90కోట్లు నిధులు విడుదల చేసిన సందర్భంగా సోమవారం నల్లగొండ జిల్లా చండూరులో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిత్రపటానికి చేనేత కార్మికులు క్షీరాభిషేకం చేశారు.

హరిహరులకు విశేష పూజలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 2: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండపై సోమవారం హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి కి స్పటికమూర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారలను మేల్కొలిపిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. ఆలయంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖ మండపంలో స్పటిక మూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 15,84,978 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త న్యాయమూర్తి పి. లక్ష్మణ్‌రెడ్డి కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు లడ్డు ప్రసాదం అందజేశారు.

రౌడీషీటర్లపై నిరంతర నిఘా

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 2: రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా పెట్టినట్లు నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ వన్‌టౌన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో 17 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశారు. రౌడీషీటర్లపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు అరెస్టు

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 2: గంజాయి రవాణా చేసి విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను నల్లగొండ రూరల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్‌కుమార్, నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణానికి చెందిన రఫీ, ఫహీం, సైమల్‌రెడ్డి, ఇమ్రాన్, యూసుఫ్‌లు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు నుంచి గంజాయిని నల్లగొండకు తరలిస్తున్నారు. నల్లగొండకు తరలించిన గంజాయిని వీరంతా కలిసి తన స్నేహితులకు, ఇతర వ్యక్తులకు విక్రయిస్తున్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు నల్లగొండరూరల్ ఎస్ఐ సైదాబాబు ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణ పరిధిలోని మర్రిగూడలోని ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మర్రిగూడలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 23 కేజీల గంజాయిని సీజ్ చేశారు. గంజాయి విక్రయిస్తున్న రఫీ, ఫహీం, సైమల్‌రెడ్డి, ఇమ్రాన్, యూసుఫ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మేమున్నామనీ..



భారీ వర్షాల కారణంగా సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం వద్ద మూడు రోజులుగా వాహనాలు నిలిచిపోవడంతో డ్రైవర్లకు స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు.

ఆయకట్టుకు గండాలే



ముకుందాపురం వద్ద లైనింగ్ లేని ఎడమ కాల్వ



- ▸ కృష్ణమ్మ ప్రవాహానికి అడుగడుగునా అడ్డంకులు
- ▸ ప్రమాదకరంగా ఎడమ కాల్వ కట్టలు
- ▸ పూర్తిస్థాయి మరమ్మతులు లేక రైతుల ఆందోళన
- ▸ ఎన్నెస్పీ అధికారుల పర్యవేక్షణ కరవు

వరుణుడి కరుణతో నిండుకుండలా కృష్ణమ్మ ఉండగా, కాల్వలనిండా ప్రవహిస్తున్నాయి. పంటల సాగులో రైతులు నిమగ్నమయ్యారు. సాగర్ కాల్వలకు నీటి విడుదల సరిగ్గా నెలరోజులైంది. అంతలోనే పెద్ద ప్రమాదం.. నీటి ప్రవాహం తట్టుకోలేక ప్రధాన ఎడమ కాల్వకు గండి పడడంతో నీటి విడుదల నిలిపివేశారు. కాల్వ మరమ్మతులకు ఎన్నాళ్లు పడుతుందో తెలియని దుస్థితి. ఈ పరిస్థితుల్లో కాల్వ నీటి ఆధారంగా నారు పోసుకుని వరి నాటుకు సిద్ధంగా ఉన్న రైతుల్లో ఆందోళన నెలకొంది.

- మిర్యాలగూడ, (వ్యవసాయం)

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 1955లో శంకుస్థాపన జరగగా 1967లో నిర్మాణం పూర్తిఅయింది. ఇప్పటికి 69 ఏళ్ల గడిచింది. ఎడమ కాల్వ 179కిలోమీటర్ల పొడవు ఉండగా మూడు జిల్లాల్లో సుమారు 22లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. లక్షల ఎకరాల వరి సాగుతో అన్నపూర్ణమ్మగా పిలుస్తున్న కృష్ణమ్మకు ఇప్పటి వరకు ఆధునికీకరణ పనులు పూర్తికాలేదు. 2008లో ప్రపంచ బ్యాంకు రూ. 4వేల444కోట్ల నిధులను విడుదల చేసింది.. ఏడు ప్యాకేజీలుగా విభజించింది. సీసీ లైనింగ్, కాల్వల పూడిక తీత, తూములు, అండర్ పాస్‌లు 2012 వరకు పనులు పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశారు. కాల్వ నిర్మాణ సమయంలో లైనింగ్‌కు ఏర్పాటు చేసినా నాపరాయి తీసి వేశారు. కొంత భాగం సిసి లైనింగ్ ఏర్పాటు చేశారు.. చాలా వరకు లైనింగ్ చేయకుండా వదిలేశారు. కాల్వ పనులు నత్తనడక నడుస్తుండటంతో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి.

అదే దుస్థితి

సాగర్ ఎడమ కాల్వకు గత నెల 2వ తేదీన నీరు విడుదల చేసి నెల రోజులైంది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రామచంద్రపురం సమీపంలో ఎడమ కాల్వకు 132,133 కిలోమీటర్ల వద్ద రెండు చోట్ల గండి పడింది. నీటి ప్రవాహానికి పంట పొలాలు దెబ్బతిన్నాయి. నీటి ఒత్తిడి తగ్గించడానికి కాల్వపై ఉన్న ఎక్స్‌కేప్ గేట్లు తెరవడానికి అధికారులు ప్రయత్నించగా తెరుచుకోకపోవడంతో ప్రమాదం జరిగింది.. సుమారు 60 అడుగుల మేర గండి పడటంతో ప్రధాన కాల్వకు నీటిని నిలిపివేశారు. భారీ వర్షాలు పడతుండటంతో ఇప్పట్లో మరమ్మతులు చేపట్టే పరిస్థితి లేదు.

తీరు మారేనా?

గత ఏడాది సాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు లేక పోవడంతో క్రాప్ హలిడే ప్రకటించారు.. ఏడాది పాటు సమయం ఉన్న కాల్వలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. చాలా ప్రాంతాల్లో మట్టి కట్టలు బలహీనంగా ఉన్నాయి.. లైనింగ్ లేక పోవడంతో ఎత్తుగా ఉన్న ప్రదేశాలలో ఉన్న కాల్వ కట్టలపై విపరీతంగా ఒత్తిడి ఉంటుంది. ఇలాంటి ప్రదేశాలను అధికారులు గుర్తించడంలో విఫలమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో పనులు చేసినా నాణ్యత లోపించిందని రైతులు చెపుతున్నారు. నీటి విడుదల జరిగి కాల్వకు ప్రమాదం జరిగితే హడావుడి చేసే అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోక పోవడం విచారకరం. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందనపుడు సాగర్ ప్రాజెక్టును మానవ శ్రమతో నిర్మించారు. ఎంత పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా కనీసం పెద్ద ప్రాజెక్టులు నిర్మాణం చేయక పోగా కనీసం మరమ్మతులు చేయలేక పోతున్నారు. ప్రాజెక్టులపై పాలకులు శ్రద్ధ వహించాలని రైతులు కోరుతున్నారు.

నాటు దశలో వరి

ఆయకట్టులో కాల్వ ఆధారంగా వరి సాగు చేసే రైతులు నార్లు పోసుకుని నాటుకు సిద్ధంగా ఉన్నారు. ఈ దశలో కాల్వకు నీటి విడుదల నిలిపివేయడంపై రైతుల్లో ఆందోళన మొదలైంది. ఆయకట్టులో బోరు బావుల కింద 30 శాతం పంటలు సాగు కాగా 70శాతం మేర సాగుకు సిద్ధంగా ఉంది. సాధారణంగా వరి నార్లు పోసిన 25 రోజుల వరకు నాటుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.. సమయం దాటితే నారు ముదిరి పోయి నారు పనికి రాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు యుద్ధ ప్రాతికదికన పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


పెద్ద దేవులపల్లి మునక

ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌కు 2013లో పానగల్ నుంచి పెద్ద వాగు ద్వారా భారీ వరద వచ్చింది. గ్రామం వైపు ఉన్న అలుగు కట్ట తెగి సగం ఇళ్లు మునిగిపోయాయి. సాగర్ కాల్వకు నీటిని నిలిపి వేసినా వరద కొన సాగింది. అదే సమయంలో రిజర్వాయర్ కట్టలపైకి నీరు రావడంతో అదనపు నీటిని విడుదలకు ఏర్పాటు చేసిన గేట్లు ఎత్తడానికి మోటార్లు లేవు. గ్రామస్తులు గేట్లు ఎత్తడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో రిజర్వాయర్ ఆనకట్టకు ఎక్స్‌కవేటర్‌తో గండి కొట్టారు. ఆ సంఘటనలో భారీగా నష్టం జరిగింది. అధికారులు అప్రమత్తంగా లేకపోవడం, సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో ముప్పు వాటిల్లింది.



ముప్పారం వద్ద ఎడమ కాల్వకు బస్తాలతో మరమ్మతులు (ఫైల్)

అప్రమత్తత ఏదీ..



నాగార్జునసాగర్ కాల్వకు 2022 సెప్టెంబరు 6వ తేదీన నిడమనూరు ముప్పారం వద్ద ఉన్న యూటీ వద్ద యూటీకి బుంగ పడి గంటల వ్యవధిలోనే కాల్వ కట్ట పూర్తిగా కొట్టుకుపోయింది. సుమారు 500 ఎకరాల్లో వరి సాగు పూర్తిగా కొట్టుకుపోయింది. పొలాల్లో భారీగా ఇసుక మేటలు ఏర్పడటంతో రైతులు నష్టపోయారు. జడ్చర్ల-మిర్యాలగూడ రహదారిపై ఏడగుడుగులు నీరు ప్రవహించింది.. వాహన రాకపోకలు నిలిచిపోయాయి. యూటీ కింది భాగంలో చిన్న పాటి బుంగ ఉన్న అధికారులు గుర్తించక పోవడంతో నీటి ప్రవాహనికి పెద్దదయి భారీ నష్టం జరిగింది. తాత్కాలికంగా గండి పూడ్చడానికి సుమారు 20రోజులు పట్టింది. ఆయకట్టులో అప్పటికే పొట్ట దశలో ఉన్న వరి పంట చాలా వరకు ఎండు దశకు చేరుకున్నాయి. సాగర్ ఎడమ కాల్వ నీటి సామర్థ్యం 11వేల క్యూసెక్కులు చాలా రోజుల వరకు సగం మాత్రమే విడుదల జరిగింది. అప్పటికే కొనఊపిరితో ఉన్న పంట ఎదుగుదల లోపించి దిగుబడులపై ప్రభావం పడింది.



సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని మొదటి జోన్‌లోని ఎంబీకెనాల్

యూటీ కాల్వల ఆక్రమణలు

- ▸ పట్టించుకోని ఎన్ఎస్‌పీ అధికారులు ▸ యూటీకి వెళ్ళే నీరు ప్రధాన కాలువలోకి రాక
- ▸ ముక్త్యాల బ్రాంచ్‌కు రెండు చోట్ల గండ్లు - మరో చోట కోతకు గురైన లైనింగ్

హుజూర్‌నగర్, సెప్టెంబరు 2 : ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు రెండు చోట్ల గండ్లు పడడంతో రైతులకు కడగండ్లే మిగిలాయి. నాగార్జునసారగ్ ఎడమ కాలువ పరిధిలోని మొదటి జోన్ ముక్త్యాల బ్రాంచ్ కింద లక్షా 25వేల ఎకరాల ఆయకట్టు ఉంది. రెండు చోట్ల గండ్లు పడడంతో మరో చోట ఇటీవల నిర్మించిన లైనింగ్ పనులు కోతకు గురికావడంతో రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి జిల్లాలోనే హుజూర్‌నగర్ ప్రాంతంలో రెండురోజుల క్రితం 30 సెంటీమీటర్ల వర్షపాతం అత్యధికంగా నమోదు కావడంతో సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని మొదటిజోన్‌గా ఉన్న 13వ బ్లాక్ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు రెండు చోట్ల గండ్లు పడ్డాయి. 18వ కిలో మీటర్, 22వ కిలోమీటర్‌ల వద్ద గండ్లు పడడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా కోట్లాది రూపాయలతో ఆధునీకరణ పనులు చేసినా కాలువకు రెండు చోట్ల గండ్లు పడడం, మరో చోట కోతకు గురికావడంతో కాలువ పరిస్థితి ఆందోళనకు గురిచేస్తుంది. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు 22వ కిలో మీటర్ వద్ద యూటీ ఉంది. కాగా ఆ యూటీకి సంబంధించి నీరు వెళ్ళే జాలు కాల్వలను కొంతమంది భూస్వాములు ఆక్రమించారు. దీంతో పంట పొలాల నుండి వచ్చిన భారీ వరద నీరు ఒక్కసారిగా హుజూర్‌నగర్ పరిధిలోని ఎంబీకెనాల్‌కు వెళ్లడంతో 22వ కిలో మీటర్ వద్ద గండ్లు పడ్డాయి. ఇదిలా ఉండగా 22వ కిలో మీటర్ వద్ద యూటీ కాలువను ఆక్రమించి సాగు చేశారు. గతంలో ఎన్నడూ రాని విధంగా భారీ వర్షపాతం నమోదు కావడంతో పంట పొలాలు పొంగి పొర్లాయి. దీంతో యూటీ కాలువ ఆక్రమణకు గురికావడంతో హుజూర్‌నగర్, కోదాడ బైపాస్ రోడ్డు నుండి నీరు పొంగిపోర్లు కాలువలోకి ప్రవహించాయి. దీనిమూలంగానే నెలరోజుల క్రితం రూ.18 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టినప్పటికి కాలువకు గండ్లు పడడం, కోతకు గురికావడం జరిగింది. దీంతో పాటు కాలువకు అనేక చోట్ల కట్టగా పోసిన మట్టి కూడా కాలువలోకి జారిపోయింది. వేపలసింగారం నుంచి రామస్వామి గట్టు మీదుగా కోదాడకు వెళ్ళే బైపాస్ రోడ్డు దాటి వర్షపు నీరు కాలువలోకి ప్రవహించడంతో ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు ఎడమ వైపున గండ్లు పడ్డాయి. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చింది ఆధునీకరణ పనులు చేసినప్పటికి కాలువ లైనింగ్ కొట్టుకుపోవడం, రెండు చోట్ల గండ్లు పడడంతో సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణలో సాగర్ కాల్వల ఆధునీకరణ పనులు చేసినప్పటికీ నీటి ప్రవాహం, పంట పలాల నుండి వచ్చిన వరద నీటితో గండ్లు పడడం, లైనింగ్ కోతకు గురికావడం సర్వత్ర చర్చనీయాంశమైంది.

పంట పొలాల నుంచి వచ్చిన నీటితో గండ్లు పడ్డాయి

పంట పొలాల నుండి భారీ వర్షపు నీరు రావడంతో ఎంబీ కెనాల్‌కు గండ్లు పడ్డాయి. రెండుమూడు రోజుల్లో నీటి ప్రవాహం తగ్గాక కాలువకు మరమ్మతులు చేసి రైతులకు పది రోజుల్లోగా నీరు అందిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నాణ్యత లోపం లేకుండా లైనింగ్ నిర్మాణ పనులు చేపట్టాం. కేవలం వరద ఉధృతి వల్లే రెండు చోట్ల గండ్లు పడడం, మరో చోట లైనింగ్ కోతుకు గురైంది.

- నీటిపారుదల శాఖ డీఈ విక్రం హుజూర్‌నగర్

26గేట్ల నుంచి సాగర్ నీటి విడుదల



నాగార్జునసాగర్ 26 గేట్ల నుంచి దిగువకు కొనసాగుతున్న నీటి విడుదల

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 2: నాగార్జునసాగర్‌లో ఓ వైపు జల సవ్వడి ఉండగా మరో వైపు పర్యాటకుల సందడి నెలకొంది. వరుస సెలవు దినాలు కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు కృష్ణమ్మ అందాలను తిలకించడానికి నాగార్జునసాగర్‌కు వచ్చారు. దీంతో సాగర్‌లో ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారిలో భారీగా ట్రాఫిక్ నిలిచింది. నాగార్జునసాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువనుంచి 3,30,078 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 884.40 అడుగులుగా (211.9572టీఎంసీలు) ఉంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 4,73,630 క్యూసెక్కులు, కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 30,131 క్యూసెక్కులు, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు మొత్తం 5,41,643 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 586.80 అడుగులుగా(304.4680 టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 6253 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,582 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం 26 క్రస్ట్ గేట్ల నుంచి 5,03,268 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 5,40,503 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువ నుంచి 5,41,643 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

'ఎత్తిపోతల'కు పెరిగిన వరద

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్ల మండలంలో ఉన్న ఎత్తిపోతల జలపాతానికి వరద ప్రవాహం పెరిగింది. దీంతో 70 అడుగుల ఎత్తు నుంచి కిందకు పడే ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించడానికి పర్యాటకులు పోటెత్తారు.

'మూసీ' ఏడు గేట్ల నుంచి నీటి విడుదల

ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం మూసీ ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. హైదరాబాద్ నగరంతో పాటు మూసీ ఎగువ ప్రాంతాలైన ఆలేరు, బిక్కేరు తదితర ప్రాంతాల నుంచి 7,549 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతోంది. రోజంతా గంటగంటకూ ఇన్‌ఫ్లోలో హెచ్చుతగ్గులు ఉండటంతో 2, 3, 4, 5, 6, 7, 8 నెంబర్ క్రస్టుగేట్లను ఒక్కోటి 4 అడుగులు ఎత్తి 17,600 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు(4.46 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 641.53 అడుగుల (3.58 టీఎంసీలు) నీరు రిజర్వాయర్‌లో నిల్వ ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

'పులిచింతల'కు కొనసాగుతున్న వరద

పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నిలకడగా వరద ప్రవాహం కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుకు సోమవారం సాయంత్రానికి 5,48,059 క్యూసెక్కులు వరద వస్తుండగా 21గేట్ల ద్వారా 5,43,617 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 172.47 అడుగులుగా(41.93 టీఎంసీలు) ఉంది.



మూసీ జలాశయం ఏడు గేట్లు ఎత్తడంతో దిగువకు వెళుతున్న నీరు

నష్టపోయిన బాధితులందరినీ ఆదుకుంటాం

● నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నడిగూడెం, సెప్టెంబరు 2: నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు గండి పడి నష్టపోయిన రైతులు, ఇళ్లు కోల్పోయిన బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని కాగిత రామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు 132, 133కిలో మీటరు వద్ద పడిన గండిని మంత్రి ఉత్తమ్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ నష్టపరిహారం విషయమై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 50ఏళ్లలో లేని వర్షాలు కురిశాయని, ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించగా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో వరద నష్టం తీవ్రంగా ఉండడం దురదృష్టకరమన్నారు. పాలేరు బ్యాక్ వాటర్ కారణంగానే ఎడమకాల్వకు గండి పడిందని, సారగ్ నీటి ఉధృతి కూడా ఓ కారణమన్నారు. నీటి ఉధృతి తగ్గాక రెండు, మూడు రోజుల్లో అంచనా వేసి వారంరోజుల్లోగా గండి పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గండి పడిన సాగర్ నీరంతా ఎక్స్‌కేప్ ద్వారా కిందికి వెళ్లడంతో రామచంద్రాపురం, ఇతర గ్రామాలకు నష్టం జరగాలేదన్నారు. పంట పొలాలు నష్టపోయిన రైతులను ప్రభులత్వ పరంగా ఆదుకుంటామనిన్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్‌తో గండి గల కారణాలను తెలుసుకున్నారు. ఎన్నెస్పీ ఎస్ఈ రమేష్‌తో గండిని పూడ్చే విషయమై మరమ్మతులు చేసేందుకు రెండు, మూడు రోజులలో అంచనాలు వేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలు వర్షాలు, వరదలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎడమకాల్వ మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ సర్పంచులు సత్యనారాయణ, నాగేశ్వరావు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నష్టంపై ప్రభుత్వానికి నివేదిక

కోదాడరూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన పాలేరు బ్రిడ్జి కూలిపోయిన ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇంత పెద్దఎత్తున వర్షం రావడం ఇదే ప్రథమన్నారు. అయినా కూడా నష్టాన్ని అంచనా వేసి ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని చెప్పారు. సాగర్ ఎడమకాలువ గండిని వారం రోజులో పూడ్చి తిరిగి నీటిని విడుదల చేస్తామన్నారు. వర్షాల వలన మృతిచెందిన కుటుంబాలకు నష్టపరిహారం, ఇళ్లు కోల్పోయిన వారికి విచారణ జరిపించి తగిన నష్టపరిహారం అందించేందుకు పంట నష్టంపై ఇప్పటికే విచారణ చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మేళ్లచెర్వు, కందిబండ రహదారి వద్ద బ్రిడ్జి కూడా కూలిపోయిందని, తొగర్రాయి బ్రిడ్జి కూచిపూడి బ్రిడ్జిలు కూడా కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన జిల్లాలో సంభవించిన వరద నష్టంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన నష్టపరిహారం మంజూరు చేయించేందుకు కృషిచేస్తానని తెలిపారు. మంత్రి వెంట ఎమ్మెల్యే పద్మావతి, మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, కలెక్టర్ తేజనంద్‌లాల్ పవర్, ఎస్పీ రణబీర్ సింగ్, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ, రజితారెడ్డి, ఎస్ఐ అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులోని ధాన్యం, బియ్యం నీళ్ల పాలు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 2: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని లింగగిరి రోడ్డులో గల శ్రీసత్యనారాయణస్వామి పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులోకి వరద నీరు వచ్చింది. దీంతో రైస్ మిల్లులో నిల్వ చేసిన ధాన్యం, బియ్యం తడిసి ముద్దయ్యాయి. వాటితో పాటు రైస్ మిల్లులోని యంత్రాలు, ఇతర వస్తువులు నీట మునిగాయి. రైస్‌మిల్లుకు వెనుక భాగంలో ఉన్న లింగగిరి మేజర్ కాల్వ పొంగి ప్రవహించడంతో పాటు మిల్లు వెనుక ప్రాంతంలోని పంట పొలాల నుంచి పెద్దఎత్తున వరద నీరు రావడంతో గోడలకు రంధ్రాలు పడి మిల్లులోకి, గోదాంలోకి వరదనీరు వచ్చింది. అదేవిధంగా మిల్లు ముందు భాగంలోకి లింగగిరి రోడ్డులోని వరద నీరు మిల్లులోకి వచ్చి చేరింది. తూర్పు, పడమర నుంచి వరద నీరు భారీగా రావడంతో మిల్లులో మోకాళ్ల లోతు నీరు వచ్చి చేరింది. దీంతో మిల్లులోని అనేక యంత్రాలు తడిసిపోయాయి. గత రబీలో కొనుగోలు చేసిన ధాన్యం, పట్టించిన బియ్యం మొత్తం నీళ్ల పాలైంది. సుమారు రూ.50లక్షల నష్టం వాటిల్లే అవకాశముందని మిల్లు యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేసింది.



పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులో నీటిలో మునిగిన బియ్యం బస్తాలు

మమ్మల్ని పట్టించుకోండి..

తిరుమలగిరి రూరల్, సెప్టెంబరు 2: సూర్యాపేట జిల్లాలో జిల్లాలో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని చింతలకుంటతండా గ్రామంలో ఎనిమిది ఇళ్ల శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించిన అధికారులు బాధితులకు ఆదివారం గ్రామంలోని పాఠశాలలో పునరావాసం కల్పించారు. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులెవరూ పునరావాస కేంద్రానికి రాలేదని, తమ గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.



చింతలకుంటతండా పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులు

చేపల వేటకు వెళ్లి డిండి వాగులో చిక్కుకున్న చెంచులు

డిండి, సెప్టెంబరు 2: నల్లగొండ జిల్లా డిండి మండలంలోని గోనబోయిన పల్లి గ్రామానికి చెందిన చెంచులు చేపల వేటకు వెళ్లి సోమవారం డిండి వాగులో చిక్కుకున్నారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గోనబోయినపల్లి గ్రామానికి చెందిన జెల్లా గురువయ్య, అతని కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సిద్దాపూర్ గ్రామ శివార్‌లో డిండి వాగు మధ్యలో బండపై తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకొని చేపలు వేటాడుతుంటారు. ఈ క్రమంలో సోమవారం డిండి ప్రాజెక్ట్ ఓవర్‌ఫ్లో కావడంతో వాగు ఉధృతంగా ప్రవహించి గురువయ్య నివాసం చుట్టూ నీళ్లు వచ్చాయి. చేపల వేటకు వెళ్లిన వారు తిరిగి రాకపోవడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, సీఐ సురేష్, రెవెన్యూ అధికారులు, సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో నీటిలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు చేపట్టారు. ఎత్తైన ప్రదేశంలో ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదని అని తెలిపారు.

డిండి ప్రాజెక్టు నిండుగా..

డిండి ప్రాజెక్టు ఎగువన కురిసిన వర్షాలకు డిండి రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం సోమవారం గరిష్టస్థాయికి చేరుకుంది. ప్రాజెక్టు నీటిమట్టం 36అడుగుల గరిష్టస్థాయికి చేరుకుంది. ఎగువ నుంచి 40వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ఈఈ శ్రీధర్‌రావు తెలిపారు. స్పిల్‌వే, వియర్ నుంచి నీరు దిగువకు విడుదలవుతుందని తెలిపారు. డిండి వాగు పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వాగులోకి చేపల వేటకుగాని, వాగు దాటేందుకు ప్రయత్నించొద్దని హెచ్చరించారు. డిండి ప్రాజెక్టు ఓవర్‌ఫ్లో అవుతుండడంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న డిండి రిజర్వాయర్ ఓవర్‌ఫ్లో దృశ్యాలను చూసేందుకు వచ్చిన సందర్శకులతో ప్రాజెక్టు ప్రాంతంలో సందడి నెలకొంది.

● డిండి

అలుగు పోస్తున్న డిండి ప్రాజెక్టు



నిలిచిన ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 2: కురుస్తున్న వర్షాలకు కేసముద్రం వద్ద రైల్వే ట్రాక్ కొట్టుకుపోవటంతో దారి మళ్లించిన పలు రైళ్లను ఆదివారం సూర్యాపేట జిల్లా నడికుడి, మఠంపల్లి, మేళ్లచెర్వు మీదుగా విష్ణుపురం వరకు పంపారు. మార్గమధ్యలో నిలిచిపోయిన రైళ్లన్నీ గమ్యస్థానానికి చేరుకోవడంతో పాటు, భారీ వర్షాలకు కారణంగా పలు రైలు రద్దు చేయడంతో ఈ ట్రాక్‌పై ప్యాసెంజర్ రైలు ప్రయాణించవని రైల్వే అధికారులు తెలిపారు.

రిజర్వేషన్ పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరిరామరాజు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండటౌన్, సెప్టెంబరు 2: బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరిరామరాజు అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్‌తో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర బీసీల కులగణన చేపట్టాలన్నారు. రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ప్రభుత్వం బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అంతేకాకుండా కేంద్రప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జాతీయ జనగణనలో బీసీ కులగణనలను చేపట్టి బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించాలన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కాసోజు విశ్వనాథం, కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కోశాధికారి నల్ల సోమమల్లయ్య, సీనియర్ ఉపాధ్యక్షుడు కేశబోయిన శంకర్‌ముదిరాజ్, నాయకులు కాశయ్యగౌడ్, పసుపులేటి సీతారాములు, కోటప్ప, చొల్లేటి రమేష్, మధుయాదవ్, ఆదినారాయణ, శంకర్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, రాములు, గీత, కవిత పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో ఫాంపాండ్స్ పనులు జరగాలి



డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

కట్టంగూరు, సెప్టెంబరు 2: రాబోయే రోజుల్లో ప్రతీ గ్రామంలో తప్పనిసరిగా ఫాంపాండ్స్ పనులు నిర్వహించాలని డీఆర్‌డీవో పీడీ ఎర్రబెల్లి శేఖర్‌రెడ్డి అధికారులకు సూచించారు. కట్టంగూరులోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తప్పకుండా అన్ని గ్రామాల్లో సీరియస్ కూలీలను గుర్తించి పనులు జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసుకోవాలని ఆదేశించారు. అనంతరం డీఆర్‌డీవోను సిబ్బంది శాలువాతో సన్మానించారు. సమావేశంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఏపీవో కడియం రాంమోహన్, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 2: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డైట్ లెక్చరర్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని రాజవరం జడ్పీ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని, చదువులో అంతరాలు తగ్గాలంటే విద్యారంగం పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్నారు. పాఠశాలల్లో పీఈటీల పాత్ర ఎనలేనిదన్నారు. విద్యార్థుల క్రమశిక్షణ, నిర్వహణ పీఈటీలదేనన్నారు. టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎరనాగుల సైదులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెరుమాళ్ల వెంకటేశం, నల్ల నరసింహ, రాజు, కృష్ణమూర్తి, చంద్రయ్య, శ్రీనివాస్, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సేవలు అభినందనీయం



ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 2: ప్రతికారంగంలో ఫొటోగ్రాఫర్ల సేవలు ఎంతో అభినందనీయమని, వారి సమస్యలపై శాసనమండలిలో చర్చించనున్నట్లు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్లుగా అవార్డులు అందుకున్న ఫొటోగ్రాఫర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ ఫొటో గ్రాఫర్లతో పాటు జర్నలిస్టులకు ఇంటి స్థలాలతో పాటు ఇళ్ల మంజూరు చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, ఆంధ్రజ్యోతి బ్యూరో చల్లా సాంబశివరెడ్డి, ఎం.రాజశేఖర్‌రెడ్డి, నర్రశేఖర్‌రెడ్డి, నలపరాజు వెంకన్న, ముచ్చర్ల విజయ్, ముచ్చర్ల శ్రీను, భజరంగ్, నరేందర్, ఆకాష్, వేణు, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

పంటల రక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలి

కేతేపల్లి, సెప్టెంబరు 2: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి, పత్తి పంటలు సాగు చేసిన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం సూచించారు. సోమవారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి, వరి పంటలను పరిశీలించారు. వరి, పత్తి పంటల్లో నిలిచిన నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేయాలన్నారు. వర్షాల వల్ల వివిధ రకాల బ్యాక్టీరియాలతో పంటలకు తెగుళ్లు ఆశించే వీలుందని వర్షాలు తగ్గిన తర్వాత లీటర్ నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, టెట్రాసైక్లిన్ 0.4 గ్రాములు చొప్పున కలిపి పంటలపై పిచికారీ చేయాలని సూచించారు.

దేవరకొండ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ

దేవరకొండ, సెప్టెంబరు 2: భారీ వర్షాలు కురుస్తున్నందున దేవరకొండ పట్టణంలోని లోతట్టు కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ అన్నారు. దేవరకొండ మునిసిపాలిటీ పరిధిలోని లోతట్టు కాలనీల్లో సోమవారం ఆయన మునిసిపల్ సిబ్బందితో కలిసి ఆయన సందర్శించారు. వర్షం కారణంగా పూడుకుపోయిన కాల్వలు, నాలాలను సిబ్బందితో తొలగింపు చర్యలు చేపట్టారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండవద్దని అంజయ్య కాలనీవాసులను కోరారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● వర్షాల నేపథ్యంలో ప్రత్యేకాధికారుల సూచనలు



మిర్యాలగూడ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, కట్టంగూరు, శాలిగౌరారం, సెప్టెంబరు 2: మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను చైతన్యపరచాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఏపీడీ శేఖర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు అన్నారు. ఆయా మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన ఇళ్లు, విద్యుత్ స్తంభాలను గుర్తించాలని, కూలిన విద్యుత్ స్తంభాలు, వైర్లకు మరమ్మతులు చేయాలని అన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా శానిటేషన్ చేయాలని, దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేపట్టాలని అన్నారు. దెబ్బతిన్న పంటలు, తోటలను గుర్తించి నష్టం అంచనా వేసి నివేదిక అందించాలన్నారు. అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సహాయ, సహకారాలు అందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సెలవులు పెట్టకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని మొక్కలను కూడా నాటాలని సూచించారు.

● మిర్యాలగూడ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి మాట్లాడారు. దెబ్బతిన్న పంటలను, తోటలను గుర్తించి నష్టం అంచనా వేసి నివేదిక అందించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని, అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



శాలిగౌరారంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

● శాలిగౌరారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో పీడీ శేఖర్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, మండల వైద్యాధికారి సూర్యశిల్ప, ఎంపీవో పద్మ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● కట్టంగూరు మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో పర్యవేక్షించి పంట నష్టాలు, వరదలు, గ్రామాల్లో వరద నీరు వచ్చిన ప్రాంతాలను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞానప్రకాష్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

● **చండూరురూరల్:** అధిక వర్షాల కారణంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మాధవరెడ్డి, మండల వైద్యాధికారి, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● **కేతేపల్లి:** వర్షాలు పూర్తిగా తగ్గే వరకూ మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి జె.హరీష్ సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో పురుషోత్తం, మండల వైద్యాధికారి అర్చన, ఎంపీవో నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **తిరుమలగిరి(సాగర్):** గ్రామాలు, తండాల్లో తలెత్తిన సమస్యలను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని మెప్మా పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ వై.కరుణాకర్ అన్నారు. వర్షాల వల్ల తలెత్తిన విద్యుత్, తాగునీటి సరఫరా, రోడ్లపై గుంతలు పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో భిక్షంరాజు, తహసీల్దార్ అనిల్, ఏఈలు సైదులు, ప్రదీప్‌రెడ్డి, వెటర్నరీ అధికారి కేశవ్ అజ్మీరా, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

● **చందంపేట:** చందంపేట మండలంలోని డిండి పరివాహక ప్రాంతమైన మోత్యతండా, తెల్‌దేవరపల్లి, పాత తెల్‌దేవరపల్లి, బాపన్‌మోడ్ తండాల్లో నీట మునిగిన పంటలను వ్యవసాయ అధికారి లక్‌పతినాయక్ సందర్శించారు. వరద కారణంగా సుమారు 70 ఎకరాల పత్తి, 30 ఎకరాల వరి పంట నీట మునిగినట్లు అంచనా వేసినట్లు తెలిపారు. ఆయన వెంట అగ్రికల్చర్ అధికారులు ఏఈవో వనజ, తదితరులు ఉన్నారు.

● **పెద్దవూర:** ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలను మెరుగుపరచాలని, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

● **కొండమల్లేపల్లి:** మండల పరిధిలో వర్షాల వల్ల పంట నష్టం, మిషన్ భగీరథ, నీటి సఫరా, శానిటేషన్ అంశాలపై దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి విజయేందర్‌రెడ్డి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, విద్యుత్ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో పీజేఎస్.రావు అధికారులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి



మిర్యాలగూడలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్



నల్లగొండ : మునిసిపాలిటీలో నివాళులర్పిస్తున్న చైర్మన్ శ్రీనివా‌స్‌రెడ్డి తదితరులు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి రైతు బాంధవుడని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం మిర్యాలగూడ బంగారుగడ్డలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగుల సంక్షేమమే ధ్యేయంగా పాలించిన నాయకుడని కొనియాడారు. నల్లగొండ, చిట్యాల మునిసిపల్ కార్యాలయాల్లో చైర్మన్లు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో, నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి వైఎస్‌ఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. చింతపల్లిలోని అనాథ, వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. మాడ్గులపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో పుల్లెంల నరసింహ, చండూరులోని ఇందిరాగాం ధీ చౌరస్తాలో మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్‌యాదవ్, అనంత చంద్రశేఖర్, చిట్యాల మండలం పెద్దకాపర్తిలో నీలకంఠం లింగస్వామి ఆధ్వర్యంలో, కనగల్ ఎక్స్‌రోడ్డులోని మందడి రాంచంద్రారెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, గడ్డం అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో, దేవరకొండలో టీపీసీసీ సభ్యుడు డాక్టర్ వేణుధర్‌రెడ్డి, యూనిస్, తిప్పర్తి మండలం సిలార్‌మియాగూడెంలో రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్ చేసిన సేవలను కొనియాడారు.


నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



గణేష్ ఉత్సవ సమితి సమావేశంలో పాల్గొన్న నాయకులు

నల్లగొండకల్చరల్, సెప్టెంబరు 2: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని గణేష్ ఉత్సవ సమితి సభ్యులు అన్నారు. నల్లగొండ పట్టణంలో సోమవారం నల్లగొండ నగర గణేష్ ఉత్సవ సమితి సమావేశం నిర్వహించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా కర్నాటి విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కట్ట సంపత్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 7 నుంచి 9 రోజుల పాటు నిర్వహించుకొని గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అన్నారు. పాతబస్తీలోని హనుమాన్‌నగర్‌లో మండపంలో నెలకొల్పిన వినాయక విగ్రహం దగ్గర లాంఛనంగా పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి వినాయక మండపాన్ని ప్రతి సభ్యులు బాధ్యతగా తీసుకొని ఉత్సవాలు ఘనంగా జరిగే విధంగా చూడాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు గార్లపాటి వెంకటయ్య, దోసపాటి శ్రీనివాస్, అల్లి సుభాష్‌యాదవ్, రావిరాల వెంకటేశ్వర్లు, రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ప్రథమస్థానంలో నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

రామగిరి, సెప్టెంబరు 2: బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో జిల్లా ప్రథమస్థానంలో నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వివిధ మోర్చాలో సమావేశంలో ఆయన మాట్లాడారు. బలమైన బీజేపీ వికసిత్ భారత్ కోసం బీజేపీ దేశవ్యాప్తంగా సెప్టెంబరు 5వ తేదీ నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుందన్నారు. ఈ మేరకు నల్లగొండ జిల్లాలో 5వ తేదీన సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలిపారు. పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు నాలుగు మార్గాలు ఉన్నాయన్నారు. 8800202024 నెంబర్‌కు మిస్ కాల్ ఇవ్వడంతో పాటు, నమో యాప్, వెబ్‌సైట్ ద్వారా సభ్యత్వాన్ని నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ బూత్ నుంచి కనీసం 200 మంది సభ్యత్వం చేర్పించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వివిధ మోర్చా నాయకులు వేణుకుమార్, రాములు, పొదుపాక లింగస్వామి కంచర్ల విద్యాసాగర్ పాల్గొన్నారు.

● **డిండి:** మండలంలోని కందుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్ రెడ్డి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు కొండల్, రాఘవేంద్ర, రామకృష్ణ, సోమిడి రాజు, శ్రీను, సాయి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 2: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన పట్టణానికి చెందిన బాక్సింగ్ క్రీడాకారులను ఆర్డీవో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ పలు విభాగాల్లో అందిస్తున్న క్రీడాశిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం క్రీడాకారులు ఫాతిమా, యోగిత, విష్ణు, సఫియాన్, రాయన్‌లతో పాటు కోచ్ రవీందర్‌గౌడ్‌ను ఆర్డీవో అభినందించారు. జాతీయస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

హరికృష్ణ ఆశయ సాధనకు కృషి చేయాలి : టీడీపీ

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 2: ఎన్టీఆర్ తనయుడు, మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ ఆశయ సాధనకు కృషి చేయాలని పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వద్దెబోయిన శ్రీనివాస్, నుసుం శ్రీను అన్నారు. హరికృష్ణ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో నందమూరి అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నందమూరి అభిమానులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ సైదులు, ఉప్పలపాటి గోపాలకృష్ణ, చావల వెంకటేశ్వర్లు, చిలుకల వెంకన్న, ఇండ్ల గణేష్, నాగేందర్, కాంతాచారి, రాజు, నర్సింహ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మాడ్గులపల్లి, సెప్టెంబరు 2: మండల కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని పలువురు జర్నలిస్టులు కోరారు. సోమవారం తహసీల్దార్ పద్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ మండలం ఏర్పడిన నాటి నుంచి పనిచేస్తున్న వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం ఉన్నా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు చిట్యాల సైదులు, రసూల్, రాంబాబు, రవి, రాజు, సైదులు, మౌలాలి, సురేందర్, చక్రపాణి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్ కేటాయించాలి

దేవరకొండ, సెప్టెంబరు 2: ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బ్రాహ్మణ సంక్షేమానికి రూ. 200కోట్ల బడ్జెట్ కేటాయించాలని బ్రాహ్మణ సంఘం నియోజకవర్గ సమన్వయ కర్త వైద్యుల కృష్ణమూర్తి, భాస్కరశర్మ అన్నారు. పట్టణంలోని కోదండరామాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాహ్మణులకు పక్కా గృహాలు, ఇంటి స్థలాలు, రుణాలు అందజేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సంఘం నూతన కమిటీ గౌరవఅధ్యక్షుడిగా సురభి కృష్ణమూర్తి శర్మ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా కుమ్మేటి రవి ప్రసాద్‌శర్మ, ఉప్పల శ్రీనివాస్‌శర్మ, కార్యదర్శి గాదె కిషోర్ శర్మ, కోశాధికారి కుర్మేటి రవి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖర్‌శర్మ, సాయి విశ్వనాథ్‌శర్మ, వెకటయ్య, శివకుమార్, శ్రీకాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 2: డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని స్థానిక హైదరాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతా లు జలమయమయ్యాయి. పలు ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. అ అంశంపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనా నికి అధికారులు స్పందించారు. ఎం పీడీవో రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి డాకునాయక్ అంబేడ్కర్ కాలనీని సందర్శించారు. కాలనీవాసులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు.

ఎస్‌జీటీయూ జిల్లా కమిటీ ఎన్నిక



శ్రీనివాసరావు

నల్లగొండరూరల్, సెప్టెంబరు 2: నల్లగొండ ఎస్‌జీటీయూ జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్‌జీటీ జిల్లా అధ్యక్షుడిగా గుర్రప్పగూడెం ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు మక్కపాటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా రెగట్టె ఎంపీపీఎస్ అక్కల శివన్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా దారం నాగరాజు, అబ్బాస్, గోలి విజయ్‌కుమార్, మహిళ విభాగం జిల్లా కన్వీనర్‌గా పుష్పలత ఎన్నుకున్నారు. సమావేశంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వనం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూరెళ్ల పౌర సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

రామగిరి: దాశరథి పురస్కార గ్రహీత, గ్రంథాలయ వ్యవస్థాపకుడు డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు ఇటీవల భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 8వ తేదీన పౌరసన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు దాసోజు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి కన్నెకంటి సత్యనారాయణచారి తెలిపారు. ఈ మేరకు విశ్వబ్రాహ్మణ వసతిగృహంలో సన్మాన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సంక్షిప్త సమాచారం...

మునుగోడు రూరల్, నార్కట్‌పల్లి: కురుమల ఆరాధ్య దైవం, శ్రీ బీరప్ప, కామరాతి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మునుగోడు మండలంలోని పలివెల, నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో బీరప్ప ఆలయాల్లో భక్తులు బోనాలు సమర్పించారు. మహిళలు నూతన వస్త్రాలను ధరించి, బోనాలను డప్పుచప్పుళ్లతో ఆలయానికి తీసుకువచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో పెద్దకుర్మ మల్లేష్, చెరుపల్లి వెంకన్న, గుత్తి గాలయ్య, లింగస్వామి, శేఖర్, నరసింహ, గుత్తి శంకర్, చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్ల రమణబాలకృష్ణ పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్: బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శిగా మండలంలోని ఆలగడప గ్రామానికి చెందిన అంతటి వెంకన్నగౌడ్ నియమితులయ్యారు. వెంకన్నగౌడ్‌కు కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు.

గట్టుప్పల్: గట్టుప్పల్ గ్రామానికి చెందిన చేనేత కార్మికురాలు చిలుకూరి పుల్లమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్ రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలీ నాయకులు మాజీ సర్పంచ్ నామని జగనాథం, కేవీఎస్ ఫౌండేషన్ సభ్యులు వెంకటేష్‌గౌడ్, కిషోర్, రమేష్‌నేత పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: వాసవీ క్లబ్ సేవలు విస్తృతం చేయాలని వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి రాయపుడి భవాని అన్నారు. పట్టణంలోని బస్టాండ్, ఏరియా ఆస్పత్రిలో క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ అమావాస్య రోజున క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చింతపల్లి: ఆలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని చైర్మన్ పూరె లక్ష్మణ్ అన్నారు. వెంకటేశ్వరనగర్‌లోని శివాలయంలో భక్తుల సహకారంతో అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చండూరురూరల్: చండూరు మండలం ఇడికూడ గ్రామానికి చెందిన ఇరిగి కృష్ణ బోర్ వెల్ డ్రైవర్ పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులకు అండగా నిలిచేందుకు తోటి డ్రైవర్లు రూ. 42వేలు సేకరించి అందజేశారు. కార్యక్రమంలో బోయపల్లి సత్యనారాయణ, రవీందర్, రమేష్, వెంకన్న, తిరుమలేష్, నాగరాజు పాల్గొన్నారు.

నల్లగొండ స్పోర్ట్స్: హైదరాబాద్ మేడ్చల్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఛాంపియన్ షిప్‌లో నల్లగొండకు చెందిన అభిరామ్ సీనియర్ 120 కిలోల విభాగంలో రజత పతకాన్ని అందుకున్నారు. స్టేట్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అభిరామ్ రజత పతకాన్ని అందుకోవడం పట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జునైద్ హష్మీ, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అష్రఫ్‌లు అభినందించారు.

తిరుమలగిరి(సాగర్): కొంపెల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి సుకుమార్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యఖర్చుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు వాట్సాప్ గ్రూప్ ద్వారా రూ.20వేలు సేకరించారు. ఆ నగదును సుకుమార్ కుటుంబసభ్యులకు అందజేశారు.

మునుగోడు రూరల్: బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా కర్నాటి లింగయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు.

నల్లగొండ క్రైం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును ఉపసంహించుకోవాలని మాల మహానాడు జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు రాష్ట్రాలకు స్వేచ్ఛ నివ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 4వ తేదీన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించే నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు సీనియర్ నాయకులు తల్లమల్ల యాదగిరి, రేకల సైదులు పాల్గొన్నారు.

నకిరేకల్: బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా కార్యదర్శిగా నకిరేకల్ మండలం తాటికల్ గ్రామానికి చెందిన బండమీది శ్రీకాంత్‌ను నియమిస్తూ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాలాజీనాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

దేవరకొండ: ఎస్సీ న్యాయవ్యాదులపై వివక్ష చూపడం సరికాదని మున్సిఫ్ కోర్టు ఎస్సీ న్యాయవాదులు వస్కుల శ్రీనివాస్, మాతంగి సురేష్, ఎర్ర కృష్ణ జాంబవ్ అన్నారు. దేవరకొండ కోర్టు ఎదుట వారు మాట్లాడారు. దేవరకొండ కోర్టులో నూతనంగా సీనియర్ సివిల్ కోర్టు ప్రారంభోత్సవ సందర్భంగా బార్ అసోసియేషన్ తమపై వివక్ష చూపిందని, వేదికపైకి పిలవలేదని ఆరోపించారు. తమకు కూడా కోర్టులో సముచిత స్థానం కల్పించాలని ఎస్సీ న్యాయవాదులు శ్రీనివాస్, రామస్వామి అన్నారు.

నిడమనూరు: సీఎంఆర్‌ఎఫ్ పేద ప్రజలకు వరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంకతి సత్యం అన్నారు. నిడమనూరుకు చెందిన జినుకుంట్ల వెంకన్న అనే లబ్ధిదారుడికి మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన అందజేసి మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ పథకం ఎంతో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొండా శ్రీనివాస్‌రెడ్డి, పగిళ్ల శివ, కుందూరు లక్ష్మారెడ్డి, సతీష్, మధు పాల్గొన్నారు.

చండూరు: చండూరు మునిసిపాలిటీకి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు రూ.1,58,500 చెక్కులు మంజూరయ్యాయి. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్, కౌన్సిలర్ మంచుకొండ కీర్తిసంజయ్, మాజీ సర్పంచులు గిరిబాబు, మల్లేష్ పాల్గొన్నారు.

చండూరు: ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్‌లక్ష్యమని ట్రస్టు జిల్లా అధ్యక్షుడు, ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని నిరుపేదలకు నిత్యావసర సరుకులు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, యాదయ్య, యాదగిరి, గణేష్ పాల్గొన్నారు.

నల్లగొండ: బీసీ కులగణన చేపట్టాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని బహుజన మహాసభ రాష్ట్ర నాయకులు కె.పర్వతాలు కోరారు. పట్టణంలోని క్లాక్‌టవర్ అమరవీరుల స్తూపం వద్ద సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని, అదేవిధంగా బీసీ కులగణన చేపట్టాలని కోరారు.